స్వర్ణయుగం మొదలైంది

అమెరికాను మళ్లీ గొప్ప దేశంగా మారుస్తా

- అక్రమ వలసలకు ఇప్పటికిప్పుడు అడ్డుకట్ట
- అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ప్రమాణస్వీకారం
- అట్టహాసంగా వేడుక.. హాజరైన ప్రముఖులు
- ఉపాధ్యక్షుడిగా జేడీ వాన్స్ ప్రమాణం

వాషింగ్టన్, జనవరి 20: అమెరికాకు స్వర్ణ యుగం మొదలయ్యిందని, దేశాన్ని మరోసారి గొప్పగా మారుస్తామని నూతన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. తనకు ఎప్పటికీ అమెరికానే ప్రధానంగా ఉంటుందని ప్రతి పౌరుడికి హామీ ఇస్తున్నట్టు చెప్పారు. అమెరికా 47వ అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు స్వీకరించారు. యూఎస్ క్యాపిటల్‌లో సోమవారం రాత్రి ఈ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ జాన్ రాబర్ట్స్.. ట్రంప్‌తో ప్రమాణస్వీకారం చేయించారు. అమెరికా ఉపాధ్యక్షుడిగా జేడీ వాన్స్ సైతం బాధ్యతలు స్వీకరించారు. ప్రమాణస్వీకారం అనంతరం అధ్యక్షుడి హోదాతో ట్రంప్ మొదటి ప్రసం గం చేశారు. దేశంలోకి అక్రమ వలస లను వెంటనే ఆపేస్తామని, దక్షిణ సరిహద్దులో ఎమర్జెన్సీని ప్రకటించి, బలగాలను పంపిస్తానని ఆయన వెల్లడించారు. మాదకద్రవ్యాల ముఠాలను ఉగ్రవాద సంస్థలుగా ప్రకటిస్తానని చెప్పారు. గల్ఫ్ ఆఫ్ మెక్సికో పేరును గల్ఫ్ ఆఫ్ అమెరికాగా మారుస్తానని, పనామా కెనాల్‌ను మళ్లీ అమెరికా స్వాధీనం చేసుకుంటుందని స్పష్టం చేశారు. అమెరికాలో విస్తృతమైన వనరులు ఉన్నప్పటికీ గత కొన్ని దశాబ్దాలుగా పారిశ్రామిక రంగం క్షీణించిందని, దేశాన్ని మరోసారి తయారీ కేంద్రంగా మారుస్తానని చెప్పారు. అమెరికాను మళ్లీ గొప్పగా మార్చాలనే కారణమే తనను హత్యాప్రయత్నం నుంచి రక్షించిందని పేర్కొన్నారు. ఏ అధ్యక్షుడూ ఎదుర్కోనన్ని పరీక్షలు తాను ఎదుర్కొన్నానని అన్నారు. 2025 జనవరి 20వ తేదీ అమెరికన్ పౌరులకు విమోచన దినంగా ఆయన అభివర్ణించారు.

సోమవారం క్యాపిటల్ భవనంలో అమెరికా 47వ అధ్యక్షుడిగా ప్రమాణం చేస్తున్న ట్రంప్

బైడెన్‌తో కలిసి క్యాపిటల్‌కు..

19వ శతాబ్దం నుంచి అమెరికా అధ్యక్షుడిగా ఒకసారి గెలిచి, తర్వాత ఓడినా మళ్లీ రెండోసారి గెలిచిన మొదటి వ్యక్తి ట్రంప్. ప్రమాణస్వీకారానికి ముందు ట్రంప్ దంపతులు అధ్యక్షుడి అధికారిక నివాసమైన వైట్ హౌజ్‌కు వెళ్లారు. జో బైడెన్ దంపతులు వీరికి స్వాగతం పలికి, అభినందనలు తెలిపారు. తేనీటి విందు తర్వాత అంతా కలిసి క్యాపిటల్‌కు బయలుదేరారు. యూఎస్ క్యాపిటల్ లోపల జరిగిన ఈ కార్యక్రమానికి మాజీ అధ్యక్షులు జో బైడెన్, బిల్ క్లింటన్, జార్జ్ బుష్, బరాక్ ఒబామా, మాజీ ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ హాజరయ్యారు. ట్రంప్ కుటుంబసభ్యులు, ట్రంప్ కీలక మద్దతుదారులు, వ్యాపార, టెక్ ప్రముఖులు ఎలాన్ మస్క్, జెఫ్ బెజోస్, మార్క్ జుకెర్‌బర్గ్, టిమ్ కుక్, సుందర్ పిచాయ్, టిక్‌టాక్ అధినేత షౌ చూ, వివిధ దేశాల ప్రతినిధులు సైతం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. డొనాల్డ్ ట్రంప్‌నకు శుభాకాంక్షలు తెలుపుతూ భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లేఖ రాశారు. ట్రంప్ ప్రమాణస్వీకార కార్యక్రమానికి భారత్ తరపున హాజరైన ఎస్ జైశంకర్ ఈ లేఖను ట్రంప్‌నకు అందించారు.

40 ఏండ్ల తర్వాత మొదటిసారి...

సాధారణంగా అధ్యక్షుడి ప్రమాణస్వీకారం యూఎస్ క్యాపిటల్‌లోని వెస్ట్ లాన్‌లో జరగాలి. ఇక్కడ ట్రంప్ ప్రమాణస్వీకారానికి ఏర్పాట్లు కూడా జరిగాయి. 2.20 లక్షల టికెట్లను సైతం ప్రజలకు పంపిణీ చేశారు. అయితే, భారీగా మంచు కురుస్తున్నందున వేదికను క్యాపిటల్ లోపలి రొటుండాకు మార్చారు. దీంతో ట్రంప్ ప్రమాణస్వీకారానికి దాదాపు 600 మంది మాత్రమే హాజరయ్యారు. గత 40 ఏండ్లలో ఇలా క్యాపిటల్ లోపల అధ్యక్షుడు ప్రమాణస్వీకారం చేయడం ఇదే మొదటిసారి. ట్రంప్ ప్రమాణస్వీకార కార్యక్రమానికి భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. వాషింగ్టన్‌లో ఏకంగా 25 వేల భద్రతా సిబ్బందిని మోహరించారు. భద్రతా చర్యల్లో భాగంగా 48.2 కిలోమీటర్ల ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేశారు. పోటోమాక్ నదిలో 25 కోస్ట్ గార్డ్ ఓడలతో పెట్రోలింగ్ నిర్వహించారు.

ఉపాధ్యక్షుడు.. తెలుగింటి అల్లుడు

అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తెలుగింటి అల్లుడు కావడం విశేషం. ఆయన భార్య ఉషా చిలుకూరి వాన్స్ తెలుగువారు. ఆమె తల్లిదండ్రులు క్రిష్, లక్ష్మి చిలుకూరి ఆంధ్రప్రదేశ్ నుంచి అమెరికాకు వెళ్లి స్థిరపడ్డారు. అమెరికాలోని శాన్‌డియాగోలో ఉష జన్మించారు. యేల్ లా స్కూల్ నుంచి లా డిగ్రీ పూర్తి చేశారు. లా చదివే రోజుల్లోనే జేడీ వాన్స్‌తో ఆమెకు ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. 2014లో హిందూ, క్రైస్తవ సంప్రదాయాల ప్రకారం కెంటకీలో వీరి వివాహం జరిగింది. ఉష, వాన్స్ దంపతులకు ఎవాన్, వివేక్, మిరాబెల్ రోజ్ అనే పిల్లలు ఉన్నారు. జేడీ వాన్స్ ఉపాధ్యక్షుడు కావడంతో అగ్రరాజ్యం అమెరికా సెకండ్ లేడీ హోదా ఉషకు దక్కింది. అమెరికా సెకండ్ లేడీ అయిన మొదటి ఏషియన్ అమెరికన్, హిందూ అమెరికన్ ఉషనే కావడం విశేషం. కాగా, మిలిటరీ జర్నలిస్టుగా, రచయితగా పేరొందిన జేడీ వాన్స్ 2022లో ఓహియో సెనేటర్‌గా విజయం సాధించారు. 2016లో ట్రంప్ అధ్యక్ష అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించి వాన్స్ ఆ తర్వాత ట్రంప్ మద్దతుదారుగా మారి, ఏకంగా ఉపాధ్యక్షుడిగా అవకాశం పొందారు.

ఉపాధ్యక్షుడిగా వాన్స్ ప్రమాణం.. చిత్రంలో ఆయన భార్య ఉషా చిలుకూరి

వైట్ హౌజ్‌లో బైడెన్ దంపతుల చివరి సెల్ఫీ

కుటుంబసభ్యులకు బైడెన్ క్షమాభిక్ష

అధ్యక్షుడిగా తన పదవీకాలం చివరి క్షణాల్లో జో బైడెన్ కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అధ్యక్షుడిగా తనకున్న విస్తృత అధికారాలతో తన బంధువులు, కుటుంబసభ్యులకు క్షమాభిక్ష పెట్టారు. తనను వేధించాలనే లక్ష్యంతో తన వారిపై దాడులు జరిగాయని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు ప్రకటించారు. యూఎస్ క్యాపిటల్‌పై జరిగిన జనవరి 6 దాడి ఘటనను విచారించిన హౌజ్ కమిటీ సభ్యులకు సైతం క్షమాభిక్ష ప్రకటించారు. వీరిపై ట్రంప్ ప్రతీకార చర్యలకు దిగొచ్చనే కారణంతో ముందు జాగ్రత్తగా ఈ నిర్ణయం తీసుకున్నారు. గతనెల తన కుమారుడికి సైతం ట్యాక్స్, ఆయుధాల కేసులోబైడెన్ క్షమాభిక్ష పెట్టారు.

వ్యాపారవేత్త నుంచి అధ్యక్షుడిగా..

1946 జూన్ 14న న్యూయార్క్‌లోని క్వీన్స్‌లో మేరీ, ఫ్రెడ్ ట్రంప్ దంపతులకు డొనాల్డ్ ట్రంప్ జన్మించారు. యూనివర్సిటీ ఆఫ్ పెన్సిల్వేనియా నుంచి 1968లో ఫైనాన్స్ డిగ్రీ పొందారు. 1971లో తన తండ్రి స్థాపించిన ట్రంప్ ఆర్గనైజేషన్ బాధ్యతలను స్వీకరించి విజయవంతంగా నడిపించారు. హోటళ్లు, రిసార్టులు, రియల్ ఎస్టేట్, క్యాసినోలు, గల్ఫ్‌కోర్సులు ఇలా అనేక వ్యాపారాలు చేశారు. 2004లో 'ది అప్రెంటీస్' రియాల్టీ షో ద్వారా అమెరికన్లకు పరిచయమయ్యారు. 1990లో చెక్ రిపబ్లిక్‌కు చెందిన అడ్లెట్, మాడల్ ఇవానా జెల్నికోవాను వివాహం చేసుకున్నారు. వీరికి డొనాల్డ్ జూనియర్, ఇవాంకా, ఎరిక్ సంతానం. మొదటి భార్యకు విడాకులిచ్చి 1999లో నటి మార్లా మాపిల్స్ వివాహం చేసుకొని టిఫానీకి జన్మనిచ్చారు. రెండో భార్యకు విడాకులిచ్చి 2005లో స్లోవేనియా మాజీ మాడల్ మెలానియాను వివాహం చేసుకున్నారు. వీరికి బారన్ విలియం ట్రంప్ అనే కుమారుడు ఉన్నాడు. 2016లో మొదటిసారి అమెరికా అధ్యక్ష బరిలో నిలిచిన డొనాల్డ్ ట్రంప్.. డెమొక్రటిక్ అభ్యర్థి హిల్లరీ క్లింటన్‌ను ఓడించి మొదటిసారి అధ్యక్షుడయ్యారు. 2020లో మరోసారి పోటీ చేసి జో బైడెన్ చేతిలో ఓటమి చవిచూశారు. 2024 ఎన్నికల్లో మళ్లీ పోటీ చేసిన డెమొక్రటిక్ అభ్యర్థి కమలా హ్యారిస్‌ను ఓడించి రెండోసారి అధ్యక్షుడయ్యారు.

కర్తవ్యపథ్‌లో 'డేర్ డెవిల్స్' వరల్డ్ రికార్డ్

కదిలే మోటార్ బైక్‌లపై ఎత్తయిన 'హ్యూమన్ పిరమిడ్'తో భారత ఆర్మీకి చెందిన 'డేర్ డెవిల్స్' సరికొత్త రికార్డు సృష్టించింది. సోమవారం ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో డేర్ డెవిల్స్ ఈ అసాధారణ ప్రదర్శనను సాధించింది. 20.4 అడుగుల ఎత్తులో హ్యూమన్ పిరమిడ్‌ను సాధించిన ఈ ఫీట్‌లో మొత్తం 40 మంది పాల్గొన్నారు. 7 మోటార్ వాహనాలపై నిలబడి 2 కిలోమీటర్ల మేర రైడ్ కొనసాగించారు. తాజా ఫీట్‌తో డేర్ డెవిల్స్.. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్, ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్ తోపాటు లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్. ఇలా 33 ప్రపంచ రికార్డులను సాధించింది. డేర్‌డెవిల్స్ మొత్తం 1,600సార్లు మోటార్ సైకిళ్లపై ప్రదర్శనలు నిర్వహించింది.

డిస్కంల ప్రైవేటీకరణపై దేశవ్యాప్త నిరసన

23న ధర్నాకు పవర్ ఇంజినీర్స్ ఫెడరేషన్ నిర్ణయం

చండీగఢ్, జనవరి 20: ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లో డిస్కమ్‌ల ప్రైవేటీకరణ ప్రయత్నాలపై ఆ శాఖ ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేశారు. రెండు రాష్ట్రాల ప్రభుత్వాల ప్రయత్నాలను నిరసిస్తూ ఈ నెల 23న దేశవ్యాప్తంగా ధర్నా నిర్వహించనున్నట్టు విద్యుత్తు ఉద్యోగులు, ఇంజినీర్ల జాతీయ సమన్వయ కమిటీ సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో జరిగే ధర్నాల్లో లక్షలాది మంది విద్యుత్తు శాఖ ఉద్యోగులు పాల్గొంటారని అఖిల భారత పవర్ ఇంజినీర్ల ఫెడరేషన్ తెలిపింది. యూపీలోని రెండు ప్రభుత్వ డిస్కంలను ప్రైవేటీకరించడం కోసం నిర్వహించనున్న ప్రీ-బిడ్డింగ్ సదస్సును రద్దు చేయాలని ఫెడరేషన్ అధ్యక్షుడు శైలేంద్ర దూబే డిమాండ్ చేశారు. వందల కోట్ల రూపాయల విలువైన డిస్కంలను ఏ ప్రాతిపదికన ప్రైవేట్ సంస్థలకు ప్రభుత్వం కట్టబెట్టాలనుకుంటున్నదని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు కొనసాగుతున్నాయన్నారు. మరోవైపు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం రూ.22 వేల కోట్ల ఆస్తులు కలిగిన విద్యుత్తు విభాగాన్ని రూ.871 కోట్లకు ఓ ప్రైవేట్ సంస్థకు అప్పగిస్తున్నదని తెలిపారు.

చర్చలు త్వరగా జరపండి

కేంద్రానికి రైతు సంఘాల డిమాండ్

చండీగఢ్: తమతో చర్చలను ఫిబ్రవరి 14న కాకుండా ముందుగానే జరపాలని రైతు సంఘాలు సోమవారం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. ఇది తాము విధిస్తున్న నిబంధన కాదని స్పష్టం చేశాయి. ఎనిమిదో వేతన సవరణ సంఘం ఏర్పాటు ప్రకటనకు ఎన్నికల సంఘం అభ్యంతరం తెలపనప్పుడు.. తమతో చర్చలు జరపడానికి కేంద్రానికి ఇబ్బందేమిటని రైతు నేతలు ప్రశ్నించారు. అయితే కేంద్రం చర్చలకు సుముఖత వ్యక్తం చేసిన నేపథ్యంలో మంగళవారం 101 మంది రైతులు నిర్వహించాలనుకున్న ఢిల్లీ మార్చ్‌ను ఈ నెల 26కు వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు. మరోవైపు వైద్య చికిత్స తీసుకొంటున్న రైతు నేత డల్లేవాల్ తన నిరాహార దీక్ష కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ పోరాటంలో ముఖ్య నాయకుడైన డల్లేవాల్ నిరాహార దీక్ష విరమించాలని రైతు నేత ఎంఎస్ రాయ్ కోరారు.

70 గంటలు పని చేయాలని డిమాండ్ చేయలేం

'ఇన్ఫోసిస్' నారాయణ మూర్తి

ముంబై : వ్యక్తిగత-వృత్తిగత జీవితాల సమతుల్యతపై చర్చ జరుగుతున్న సమయంలో ఇన్ఫోసిస్ సహవ్యవస్థాపకుడు ఎన్ఆర్ నారాయణ మూర్తి సోమవారం మరింత వివరణ ఇచ్చారు. ఎక్కువ సేపు పని చేయాలని ఎవరినీ ఎవరూ అడగలేరన్నారు. సుదీర్ఘ సమయం పని చేయవలసిన అవసరం గురించి ఎవరికి వారు ఆలోచించుకుని, అర్థం చేసుకోవాలని తెలిపారు. వారానికి 70 గంటలు పని చేయాలని ఆయన గతంలో యువతకు ఇచ్చిన సలహాపై విమర్శలు వచ్చిన సంగతి తెలిసిందే. ''నేను ఉదయం 6.30 గంటలకు ఆఫీస్‌కు వెళ్లేవాడిని. రాత్రి 8.30 గంటలకు ఆఫీస్ నుంచి ఇంటికి బయల్దేరేవాడిని. ఇది వాస్తవం. నేను దాదాపు 40 ఏళ్లపాటు అలా చేశాను. కాబట్టి, అది తప్పు అని ఎవరూ చెప్పలేరు'' అన్నారు. నారాయణ మూర్తి సోమవారం వార్షిక కిలాచంద్ స్మారకోపన్యాసంలో ప్రసంగించారు. అనంతరం అడిగిన ఓ ప్రశ్నకు ఆయన ఈ సమాధానం చెప్పారు.

హత్యాచార దోషికి జీవితఖైదు

- కోల్‌కతా ఆర్జీ కర్ వైద్యురాలి కేసులోసియాల్దా కోర్టు శిక్ష
- అత్యంత అరుదైన నేరం కాదన్న న్యాయస్థానం
- తీర్పుపై బాధితురాలి కుటుంబం అసంతృప్తి
- ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని ప్రకటన

తీర్పు సందర్భంగా సియాల్దా కోర్టు ముందు పోలీసుల బందోబస్తు

కోల్‌కతా: ఆర్జీ కర్ దవాఖానలో ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడిన సంజయ్ రాయ్‌కు జీవిత ఖైదు పడింది. ఈ మేరకు సోమవారం సియాల్దా కోర్టు అడిషనల్ జిల్లా, సెషన్స్ జడ్జి అనిర్బన్ దాస్ శిక్ష ఖరారు చేశారు. ఈ నేరం 'అత్యంత అరుదైన' విభాగంలోకి రాదని, అందుకే మరణశిక్ష విధించడం లేదని న్యాయమూర్తి పేర్కొన్నారు. సెక్షన్ 64, 66, 103(1) కింద మరణించే వరకు జైలులో ఉండేలా యావజ్జీవ జైలు శిక్షతో పాటు, రూ.50 వేల జరిమానా విధిస్తున్నట్టు చెప్పారు. బాధితురాలు తన పని ప్రదేశమైన దవాఖానలో మరణించినందున ఆమె కుటుంబానికి పరిహారం చెల్లించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని న్యాయస్థానం పేర్కొన్నది. హత్య ఘటనకు రూ.10 లక్షలు, అత్యాచార ఘటనకు రూ.7 లక్షలు కలిపి రూ.17 లక్షలు పరిహారంగా చెల్లించాలని ఆదేశించింది.

హైకోర్టులో అప్పీల్ చేసుకోవచ్చు

శిక్ష ఖరారు చేసే ముందు న్యాయస్థానంలో ఇరుపక్షాల వాదనలు విన్నది. దోషికి మరణ శిక్ష విధించాలని సీబీఐ తరపు న్యాయవాది కోర్టును కోరారు. అయితే, తాను ఎలాంటి నేరానికి పాల్పడలేదని, అమాయకుడినని, అన్యాయంగా కేసులో ఇరికించారని సంజయ్ రాయ్ చెప్పుకొచ్చారు. ఇరుపక్షాల వాదనలు విన్న కోర్టు.. ఈ కేసు అత్యంత అరుదైన కేటగిరిలోకి రాదని పేర్కొంటూ మరణించే వరకు జైలులో ఉండేలా జీవిత ఖైదు ఖరారు చేసింది. కాగా, తీర్పుపై కోల్‌కతా హైకోర్టులో అప్పీల్ చేసుకోవచ్చని, అవసరమైతే న్యాయ సహాయాన్ని పొందవచ్చని దోషి సంజయ్ రాయ్‌కు కోర్టు సూచించింది.

న్యాయం జరిగే వరకు పోరాడతాం

సియాల్దా కోర్టు తీర్పుపై బాధితురాలి తల్లిదండ్రులు అసంతృప్తి వ్యక్తం చేశారు. 'ఈ తీర్పుతో మేము షాక్‌కు గురయ్యాం. ఒక డ్యూటీ డాక్టర్ అత్యాచారం, హత్యకు గురవడం అత్యంత అరుదైన నేరం కాదా? ఈ నేరం వెనుక పెద్ద కుట్ర ఉంది. కేసు విచారణ సరిగ్గా జరగలేదు. చాలామంది నేరస్థులను రక్షిస్తున్నారు. న్యాయం జరిగే వరకు మేం పోరాడతాం. ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం' అని వారు పేర్కొన్నారు. కాగా, తీర్పుపై స్పందించేందుకు సంజయ్ రాయ్ తల్లి మాలతి నిరాకరించింది. 'నేనేమీ మాట్లాడలేను. జరిగిన ఘటనలకు సిగ్గుపడుతున్నా. ఇక్కడి నుంచి వెళ్లిపోండి' అని విలేకరులపై ఆమె అరిచారు.

పోలీసులు దర్యాప్తు చేసి ఉంటే మరణశిక్ష పడేది: సీఎం మమత

కోర్టు తీర్పుపై పశ్చిమ బెంగాల్ సీఎం మమత అసంతృప్తి వ్యక్తం చేశారు. 'కేసును మా చేతుల్లోంచి బలవంతంగా లాక్కున్నారు. కోల్‌కతా పోలీసులు కేసు విచారించి ఉంటే మరణశిక్ష పడేలా చేసేవారు. పోలీసులు విచారించిన ఇలాంటి అనేక కేసుల్లో మరణశిక్ష పడింది' అని ఆమె అన్నారు. తీర్పుపై హైకోర్టును ఆశ్రయిస్తామని చెప్పారు.

ప్రియుడిని చంపిన యువతికి ఉరి

కేరళ కోర్టు సంచలన తీర్పు



తిరువనంతపురం: కేరళలో 2022లో సంచలనం సృష్టించిన ప్రియుడి హత్య కేసులో యువతికి ఉరిశిక్ష విధిస్తూ సోమవారం న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. ఇదే కేసులో మూడో నిందితుడైన ఆమె బంధువు నిర్మలకుమారన్‌కు మూడేండ్ల కారాగార శిక్ష విధిస్తూ నెయ్యట్టిన్‌కార అదనపు జిల్లా సెషన్స్ కోర్టు తీర్పు వెలువరించింది. తన విద్యార్హతలు, క్రిమినల్ చరిత్ర లేకపోవడం, తన తల్లిదండ్రులకు తాను ఏకైక కుమార్తె కావడం వంటి కారణాలను దృష్టిలో పెట్టుకుని శిక్ష విషయంలో ఉదారంగా వ్యవహరించాలని నిందితురాలు గ్రీష్మ (24) చేసిన అభ్యర్థనను కోర్టు తోసిపుచ్చింది. నిందితురాలి నేర తీవ్రతను పరిగణనలోకి తీసుకుంటే ఆమె వయసు, ఇతర కారణాలను పరిశీలించాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. తిరువనంతపురం జిల్లాలోని పరస్సలకు చెందిన షరోన్ రాజ్(23), గ్రీష్మ కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారని పబ్లిక్ ప్రాసిక్యూటర్ తెలిపారు. నాగర్‌కోయిల్‌కు చెందిన ఓ సైనికుడితో వివాహం నిశ్చయం కావడంతో షరోన్ రాజ్‌తో తెగదెంపులు చేసుకోవాలని గ్రీష్మ నిర్ణయించుకుంది. అయితే ఇందుకు షరోన్ రాజ్ నిరాకరించడంతో అతడిని అంతం చేయాలని భావించింది. కుట్రలో భాగంగా తమిళనాడులోని కన్యాకుమారి జిల్లా రామవర్‌మంచిరాయ్‌లోని తన ఇంటికి షరోన్‌ను తీసుకెళ్లిన గ్రీష్మ ఆయుర్వేద టానిక్‌లో క్రిమిసంహారక మందు కలిపి అతని చేత తాగించింది. శరీరంలోని వివిధ అవయవాలు పని చేయకపోవడంతో 11 రోజుల తర్వాత 2022 అక్టోబర్ 25న దవాఖానలో షరోన్ మరణించాడు. షరోన్ హత్యను దశల వారీగా పూర్తి చేయాలని గ్రీష్మ కుట్ర పన్నినట్టు కోర్టు నిర్ధారించింది. ప్రియుడిని చంపిన తర్వాత ఆమె ఆత్మహత్యాయత్నం చేయడం ఆమె నేర చరిత్రను వెల్లడిస్తుందని కోర్టు అభిప్రాయపడింది. ఈ కేసులో దోషిగా తేలిన గ్రీష్మ అపార క్రిమినల్ మేధావని, ప్రియుడి హత్యకు ఆమె పకడ్బందీగా పథక రచన చేసిందని కోర్టు పేర్కొంది. తాను తప్పించుకోగలనని ఆమె నమ్మినప్పటికీ పోలీసు బృందం శాస్త్రీయ పద్ధతిలో చేసిన దర్యాప్తు ఆమె అరెస్టుకు దారితీసిందని పబ్లిక్ ప్రాసిక్యూటర్ తెలిపారు. తనకు నేర చరిత్ర లేదని గ్రీష్మ చేసిన వాదనను కోర్టు తిరస్కరిస్తూ 2022 ఆగస్టు 22న పండ్ల రసంలో అధిక మోతాదులో పారాసిటమాల్ టాబ్లెట్లను కలిపి షరోన్‌ను విషంతో చంపాలని ఆమె అంతకు ముందు కూడా పథకం వేసిందని, అయితే పండ్ల రసం చేదుగా ఉండడంతో దాన్ని తాగడానికి నిరాకరించి షరోన్ చావును తప్పించుకున్నాడని ఆయన చెప్పారు. గ్రీష్మ చర్యలు సమాజానికి తప్పుడు సందేశాన్ని పంపిస్తాయని, పవిత్రంగా భావించే ప్రేమకు కళంకం తెచ్చిపెడతాయని కోర్టు పేర్కొన్నట్టు ప్రాసిక్యూటర్ తెలిపారు. దీన్ని అత్యంత అరుదైన నేరంగా కోర్టు పరిగణించినట్టు ఆయన తెలిపారు.

జమ్మూకశ్మీర్‌లో ఎన్‌కౌంటర్.. జవాన్ వీరమరణం

శ్రీనగర్: జమ్మూ కశ్మీరులోని సోపోర్ ప్రాంతంలో ఆదివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో సిపాయి పంగల కార్తీక్ ప్రాణాలు కోల్పోయారు. సైనికాధికారులు సోమవారం తెలిపిన వివరాల ప్రకారం, జలూర గుజ్జర్‌పటిలో ఉగ్రవాదులు ఉన్నట్లు సమాచారం రావడంతో భద్రతా దళాలు ఆదివారం ఆ ప్రాంతానికి వెళ్లాయి. ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో గాయపడిన కార్తీక్‌ను, సురక్షిత ప్రాంతానికి తీసుకెళ్లే సమయంలో ఆయన ప్రాణాలు విడిచారు. ఉగ్రవాదుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. కార్తీక్ ప్రాణ త్యాగం చేశారని, ఆయనకు చినార్ కోర్‌లోని అన్ని ర్యాంకుల సిబ్బంది, అధికారులు గౌరవ వందనం చేస్తున్నారని భారత సైన్యంలోని చినార్ కోర్ ఓ పోస్టులో తెలిపింది. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపింది.

మూడ్‌ను మార్చేసే బ్రెయిన్ చిప్

- అల్ట్రాసౌండ్‌తో మెదడు నియంత్రణ
- మార్చి నుంచి మానవ ప్రయోగాలు
- మానసిక సమస్యల చికిత్సకు వినియోగం



లండన్, జనవరి 20: పుర్రె లోపల ఒక చిప్‌ను అమర్చి అల్ట్రాసౌండ్ ద్వారా మెదడును నియంత్రించే అధునాతన ప్రయోగానికి శాస్త్రవేత్తలు సిద్ధమవుతున్నారు. బ్రెయిన్-కంప్యూటర్-ఇంటర్ఫేస్(బీసీఐ)గా పిలిచే ఈ సాంకేతికతతో అమెరికాకు చెందిన ఫారెస్ట్ న్యూరోటెక్ అనే సంస్థ ఒక బ్రెయిన్ చిప్(ఇంప్లాంట్)ను తయారుచేసింది. ఇప్పటివరకు ఉన్న బీసీఐ ఇంప్లాంట్లను వినియోగించేందుకు ఎలక్ట్రోడ్‌లను నేరుగా మెదడులోకి పంపించాల్సి ఉంటుంది. ఈ కొత్త చిప్‌ను మాత్రం పుర్రె కింద, మెదడు బయట అమరుస్తారు. దీని ద్వారా మెదడు పనితీరును సమగ్ర 3డీ మ్యాప్‌లుగా రూపొందించవచ్చు. ఆ తర్వాత అల్ట్రాసౌండ్ తరంగాల ద్వారా మెదడులోని నిర్దిష్ట న్యూరాన్ల సమూహాన్ని శాస్త్రవేత్తలు బయటి నుంచి యాంత్రికంగా ఉత్తేజపరుస్తారు. తద్వారా ఆందోళన, నిరాశ, మూర్ఛ వంటి సమస్యలను దూరం చేయవచ్చని, మూడ్‌ను మార్చేయవచ్చని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. ఈ చిప్‌పై ఇంగ్లండ్‌కు చెందిన నేషనల్ హెల్త్ సర్వీస్(ఎన్‌హెచ్ఎస్) మార్చి నుంచి మనుషులపై ప్రయోగాలు జరపనుంది. ఇప్పటికే వివిధ మెదడు సర్జరీలు చేయించుకున్న వారిపై ప్రయోగాలు జరగనున్నాయి. వీరికి సర్జరీ కోసం ఇప్పటికే కొంతభాగం పుర్రె తొలగించి ఉంటుంది కాబట్టి వీరిపై ప్రయోగాలు చేయనున్నట్టు శాస్త్రవేత్తలు తెలిపారు. మూడేండ్ల పాటు ప్రయోగాలు జరగనున్నాయి.

లో బ్యాటరీ ఉంటే చార్జీల మోతే!

- ప్రైసింగ్‌లో పారదర్శకత శూన్యం
- బ్యాటరీ లెవల్ తగ్గితే అధిక చార్జీ
- క్యాబ్ అగ్రిగేటర్ల మాయాజాలం

న్యూఢిల్లీ, జనవరి 20: ప్రస్తుత ఆధునిక యుగంలో ప్రతి అవసరానికీ చాలా మంది ఆన్‌లైన్‌పైనే ఆధారపడుతున్నారు. ఆహార అవసరాల కోసం ఫుడ్ డెలివరీ యాప్‌లను, ప్రయాణాల కోసం రైడ్ హెయిలింగ్ సర్వీసులను ఆశ్రయిస్తున్నారు. కానీ, ఆ ప్లాట్‌ఫామ్‌లు అనుసరిస్తున్న ప్రైసింగ్ విధానంపై నిత్యం అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వాటి చార్జీలు ఒక్కో ఫోన్‌లో ఒక్కో రకంగా ఉంటున్నాయని, వేర్వేరు ధరలతో తమను మోసగిస్తున్నాయని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రముఖ క్యాబ్ సంస్థ 'ఉబర్' తన కస్టమర్ల నుంచి వసూలు చేస్తున్న చార్జీల తీరుపై ఢిల్లీకి చెందిన రిషభ్ సింగ్ అనే ఆంత్రప్రెన్యూర్ ఓ ప్రయోగాన్ని నిర్వహించారు. అందుకోసం రెండు ఆండ్రాయిడ్ ఫోన్లు, మరో రెండు ఐఫోన్లను ఉపయోగించారు. వాటన్నింటిలో ఒకే ఉబర్ ఖాతాతో లాగిన్ అయ్యారు. తద్వారా ఒకే సమయంలో ఒకే విధమైన రైడ్‌లకు చార్జీలు ఎలా మారిపోతున్నాయో పరిశీలించారు. ఈ ప్రయోగంలో దిగ్భ్రాంతికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆ ఫోన్లలో చార్జీలతోపాటు, డిస్కౌంట్ల లోనూ తేడాలు కనిపించాయి. ఒక ఫోన్‌లో 13 శాతం, మరో ఫోన్‌లో 50 శాతం రాయితీ ఇస్తున్నట్టు దర్శనమిచ్చింది. దీంతో వినియోగదారుల నుంచి 'ఉబర్' వసూలు చేస్తున్న చార్జీలు డివైజ్ ప్లాట్‌ఫామ్ (ఆపరేటింగ్ సిస్టమ్)ను బట్టి వేర్వేరుగా ఉంటున్నట్టు తేలింది. ఒకే ఖాతా, ఒకే లొకేషన్, సమయం, షరతులు ఉన్నప్పటికీ ధరల్లో తేడాలు కనిపించాయని రిషభ్ సింగ్ వెల్లడించారు. అంతేకాకుండా